సాక్షి సిద్దిపేట

శనివారం । 4 । అక్టోబర్ । 2025



పండగపూట విషాదం

దసరా పండుగ రోజు వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఏడుగురు మృత్యువాత పడ్డారు.

వివరాలు 10లో ▸



మహాత్మా మన్నించు

గాంధీ జయంతిరోజునే మెదక్ జిల్లా యశ్వంత్‌రావుపేట గ్రామంలో కొందరు గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. వివరాలు 10లో ▸



పడకేసిన పారిశుద్ధ్యం

దుబ్బాకలోని కొన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

రేపు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 5న ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు జరుగనున్నట్లు, జిల్లా అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సిద్దిపేట, చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక, మండలాల ఎన్నికలు ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

గాంధేయ మార్గాన్ని అనుసరించాలి

అదనపు డీసీపీ కుశాల్కర్



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు డీసీపీ కుశాల్కర్, సాయిప్రసాద్

సిద్దిపేటకమాన్: మహాత్మా గాంధీ చూపిన సత్యం, ధర్మం, అహింసా మార్గాలను ప్రతీ ఒక్కరు అనుసరించాలని అదనపు డీసీపీ అడ్మిన్ సీహెచ్ కుశాల్కర్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పోలీసు కమిషనరేట్‌లో గాంధీ చిత్ర పటానికి గురువారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గాంధీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగినపుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ సాయిప్రసాద్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరికీ విజయాలను అందించాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



గజ్వేల్‌లో నిర్వహించిన దసరా వేడుకల్లో పాలపిట్టను ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ

గజ్వేల్: దసరా అందరి జీవితాల్లో విజయాలను అందించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఆకాంక్షించారు. గజ్వేల్ పట్టణంలోని డీసీఎంఎస్ గోదాము వద్ద గురువారం మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలపిట్టను ఎగురవేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ చెడుపై మంచి విజయంగా చెప్పుకునే దసరా పండుగ అందరికీ మేలు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, భరత్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి: చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

సిద్దిపేటఅర్బన్: నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే సీపీఎం అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని కార్మిక కర్షక భవన్‌లో గురువారం జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో చుక్క రాములు పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో పాలకులు లేక సమస్యలతో ప్రజలు విసిగిపోతున్నారని, వారికి అండగా నిలుస్తున్న పార్టీ సీపీఎం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట నీటిగోస

కౌడిపల్లి(నర్సాపూర్): పండుగ పూట నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. జాతీయ రహదారిపై కొద్దిసేపు రాస్తారోకో చేశారు. ఈసంఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. కౌడిపల్లిలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీరు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఓవైపు భగీరథ నీరు రాక, మరో వైపు గ్రామంలో బోరుబావులు సరిగా లేకపోవడంతో కొత్తకాలనీకి చెందిన పలువురు రోడ్డు పైకి వచ్చి రాస్తారోకో చేశారు. దీంతో స్పందించిన అధికారులు ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తామని చెప్పడంతో విరమించారు.

బీసీల్లో జోష్

- స్థానిక సంస్థల్లో బీసీలకు గతంకంటే పెరగనున్న స్థానాలు
- 2018, 2019లో బీసీలకు 225 మందికి పదవులు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడంతో స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిథ్యం పెరగనుంది. బీసీలకు రిజర్వేషన్ స్థానాల పెంపుతోపాటు జనరల్ స్థానాల్లో సైతం బీసీ అభ్యర్థులు గెలుపొందితే మరిన్ని పెరగనున్నాయి. గత రిజర్వేషన్ల ప్రకారం 225 పదవులకు బీసీలకు రిజర్వేషన్ అయితే ఈసారి ఆ సంఖ్య 327కు పెరిగింది. దీంతో గతంలో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు కలిపి 102 పదవులు అధికంగా దక్కనున్నాయి. 2019 ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీలకు 70 సీట్లు రిజర్వేషన్ అయితే ఈసారి ఆ సంఖ్య 98కి పెరిగింది. అలాగే ఎంపీపీ, జెడ్పీటీసీలలో 2019లో 6సీట్లు కేటాయిస్తే ప్రస్తుతం 11కు చేరింది. 2018లో బీసీలకు 143 సర్పంచ్‌లను కేటాయించగా ఈసారి 207 కేటాయించారు.

గతంకంటే 102 పదవులు అధికం

2018, 2019 జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ల ప్రకారం ప్రస్తుతం రిజర్వేషన్లతో పోలిస్తే 102 మందికి అధికంగా దక్కనున్నాయి. గతం కంటే సర్పంచ్‌లు 64, ఎంపీటీసీలు 28, జెడ్పీటీసీలు 5, ఎంపీపీలు 5 పెరగనున్నారు. అలాగే జనరల్ స్థానాల్లో బీసీలు గెలుపొందితే మరికొందరు పదవులు పొందనున్నారు.



ఉత్సాహంగా బీసీ నేతలు

ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలలో కల్పించడంతో పలువురు బీసీ నేతలు ఉత్సాహంగా ఉన్నారు. పోటీ చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. రిజర్వేషన్ కలిసి వస్తుండటంతో గతంలో పోటీ చేయాలనే ఆలోచన లేని వారు సైతం ప్రస్తుతం ముందుంటున్నారు. జెడ్పీ చైర్మన్ బీసీ జనరల్‌కు కేటాయించడంతో మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. 11 జెడ్పీటీసీ స్థానాలు బీసీలకు కేటాయించడంతో వారిలోనే ఒకరికి జెడ్పీ పీఠం దక్కనుంది.

2019లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, 2018లో సర్పంచ్ రిజర్వేషన్లు ఇలా

రిజర్వేషన్	ఎంపీటీసీ	జెడ్పీటీసీ	ఎంపీపీ	సర్పంచ్
బీసీ	70	06	06	143
ఎస్సీ	48	04	04	93
ఎస్టీ	04	01	01	18
అన్‌రిజర్వ్డ్	110	12	12	245

ప్రస్తుత రిజర్వేషన్లు ఇలా

రిజర్వేషన్లు	ఎంపీసీటీ	జెడ్పీటీసీ	ఎంపీపీ	సర్పంచ్
బీసీ	98	11	11	207
ఎస్సీ	48	05	05	97
ఎస్టీ	04	01	01	22
అన్ రిజర్వ్డ్	80	09	09	182

గాంధీ మార్గంలో నడుద్దాం

ఎంపీ రఘునందన్‌రావు



దుబ్బాకలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హైమావతి తదితరులు

దుబ్బాక: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో నడుద్దామని ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం దుబ్బాక పట్టణంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ...అహింసామార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహానీయుడు గాంధీ అని ఆయన స్ఫూర్తితో దేశరక్షణకు పాటుపడుదామన్నారు. యువత సన్మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

దుబ్బాక మండలంలో దసరా ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రఘునందన్‌రావు తన స్వగ్రామం బొప్పాపూర్‌లో, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తన స్వగ్రామం పోతారంలో తమ కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి దసరా సంబరాల్లో పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా గాంధీ జయంతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గురువారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి కలెక్టర్ హైమావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సయ్యద్ రఫీ, కలెక్టరేట్ ఏఓ రహమాన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం

ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దామని ఉమ్మడి జిల్లా మెదక్ ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిద్దిపేటలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో స్థానిక ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ...స్థానిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సీట్లు గెలుపొందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. అందుకోసం నాయకులు, కార్యకర్త ప్రజల్లో మమేకం అవ్వాలని సూచించారు. రాజకీయ ఉనికి కాపాడుకునేందుకే బీఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలని ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వన దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. గంగమ్మకు పూజలు చేసి మంజీరా నదిలో ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేసి నిమజ్జనం చేశారు. కాగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను శుక్రవారం ఏడుపాయల మంజీరా నదిలో నిమజ్జనం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో జనసంద్రంగా మారింది. రెండవ బ్రిడ్జిపై ట్రాఫిక్ జాం అయి వాహనాలకు అంతరాయం ఏర్పడింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు. భక్తులు రాజగోపురంలోని దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేదలకోసమే పరితపించిన రామలింగారెడ్డి

- నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నా సాధారణ జీవితమే
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ చైర్మన్ వెంకటయ్య



రామలింగారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

దుబ్బాక/దుబ్బాకటౌన్: తుదిశ్వాస విడిచేంత వరకు మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి పేదల కోసమే పరితపించారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. రామలింగారెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం చిట్టాపూర్‌తోపాటు దుబ్బాకలో ఆయన విగ్రహాలకు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా రామలింగారెడ్డి అత్యంత సాధారణ జీవితమే గడిపి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన భౌతికంగా లేకున్నా పేదప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలచిపోయాడని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రామలింగారెడ్డి కుమారుడు సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజమౌళి, ఎల్లారెడ్డి తదితరులున్నారు.

దసరా సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

దుబ్బాక పట్టణంలో రెడ్డిసేన ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం రావణ దహనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాటు చేసిన లైటింగ్, డీజే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువతీ, యువకుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

దసరాకు కిక్కెంచారు

- రూ.20కోట్ల మద్యం విక్రయాలు
- వరుస సెలవులు, పండుగల నేపథ్యంలో ఎక్సైజ్‌కు భారీ ఆదాయం



మద్యం దుకాణాల వద్ద బారులు తీరిన మద్యం ప్రియులు

సిద్దిపేటకమాన్: బతుకమ్మ, దసరా వరుస సెలవుల నేపథ్యంలో మందుబాబులు తెగ తాగేశారు. దసరా పండగ, గాంధీ జయంతి ఒకేరోజు రావడంతో మద్యం దుకాణాలు మూసి వేసినప్పటికీ ఒక రోజు ముందే మద్యం ప్రియులు మద్యాన్ని కొనుగోలు చేసుకున్నారు. జిల్లాలోని మద్యం దుకాణాల ద్వారా గత నెల 29, 30, ఈ నెల 1వ తేదీల్లో రూ.20 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో చూస్తే ఈ దసరా పండగా ముందుగా సెప్టెంబర్ నెలాఖరు నుంచే సేల్ ప్రారంభం కావడంతో అదే నెలలో సేల్ వివరాలు నమోదయ్యాయి. జిల్లా ప్రజలు దసరా పండగను రెండు రోజులు ముందు, మాంసంతో విందులు జరుపుకున్నారు.

మూడు రోజుల్లో రూ.20కోట్ల విక్రయాలు

జిల్లాలోని 93 మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా దసరా పండగకు మూడు రోజుల్లో రూ.20కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. బతుకమ్మ, దసరా పండగ నేపథ్యంలో గత నెల 29న 6,907 లిక్కర్ బాక్సులు, 10,445 బీర్ బాక్సులు, 30న 7,632 బాక్సుల లిక్కర్, 9,796 బాక్సుల బీర్లు, ఈ నెల 1న 3,761 బాక్సుల లిక్కర్, 9,686 బాక్సుల బీర్లు విక్రయించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దసరా పండగ రోజు గాంధీ జయంతి రావడంతో మద్యం దుకాణాలు మూసి వేసినప్పటికీ ఒక రోజు ముందుగానే అధికంగా మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో చూస్తే ఈ ఏడాది అధికంగా మద్యం విక్రయాలు జరిగి ఎక్సైజ్ శాఖకు భారీగా ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

ముందుగానే కొనుగోళ్లు

ఈ ఏడాది దసరా పండుగకు మూడు రోజుల్లో జిల్లాలో రూ.20 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. బతుకమ్మ పండుగ సెప్టెంబర్ ఆఖరి వారంలో ప్రారంభం కావడం వరుస దసరా సెలవులు రావడంతో మద్యం విక్రయాలు బాగా పెరిగాయి. దసరా రోజునే గాంధీ జయంతి కూడా రావడంతో ఒకరోజు ముందుగానే మద్యం కొనుగోళ్లు భారీగా జరిగాయి.

– శ్రీనివాసమూర్తి, సిద్దిపేట, ఎక్సైజ్ సూపరింటెండెంట్



రంగథాంపల్లిలో రావణ దహన కార్యక్రమానికి హాజరైన ప్రజలు

వైభవంగా దసరా ఉత్సవం

- జిల్లాలో ఘనంగా కొనసాగిన దసరా పండుగ
- ఉదయం నుంచే ఆలయాలు కిటకిట
- సాయంత్రం రావణసుర కటౌట్‌ల దహనాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ప్రజలు దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. గురువారం ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు తరలివచ్చి శమీ పూజ నిర్వహించి, పాలపిట్టను దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా అమ్మవార్లు, హనుమాన్ ఆలయాల వద్ద వాహనాలకు పూజలు నిర్వహించారు. దీంతో ఏ ఆలయం వద్ద చూసినా భారీ లైన్లు కన్పించాయి. జిల్లా కేంద్రంలోని కోటిలింగాల ఆలయం, రంగదాంపల్లి హనుమాన్ ఆలయం, నర్సాపూర్ హనుమాన్ ఆలయం, రూరల్ పోలీస్‌స్టేషన్ హనుమాన్ ఆలయం, శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయాలలో శమీపూజ నిర్వహించారు. లాల్‌కమాన్, నర్సపూర్ హనుమాన్ ఆలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సాయంత్రం ఆలయాల వద్ద రావణ దహనం నిర్వహించారు. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నీరు, పండ్లు, ఆహారపదార్థాలను ఉచితంగా పంపిణీ చేశారు.



రంగథాంపల్లిలో దహనం చేస్తున్న రావణుడి కటౌట్

పిల్లలకు సంస్కృతిని నేర్పించాలి

జిల్లా కేంద్రంలోని ఆలయాల వద్ద జరిగిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూరల్ పోలీస్ స్టేషన్ హనుమాన్ ఆలయంలో వెండి కిరీటాన్ని అందించారు. అనంతరం ఆలయాల వద్ద పాలపిట్టను ఎగురవేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...చిన్నారులకు మన సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలన్నారు. దేశానికి మంచినీళ్ల పథానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచిందని తెలిపారు. సిద్దిపేటకు అన్ని రకాల విద్యా సంస్థలను తీసుకువచ్చామన్నారు. కాళేశ్వరంతో రంగనాయకసాగర్ జలకళతో కళకళలాడుతుందన్నారు. కాశీ పురోహితులు సిద్దిపేటకు వచ్చి హారతి ఇవ్వడాన్ని చూస్తే సాక్షాత్తూ కాశీని తలపించిందన్నారు.

రాజరాజేశ్వరీదేవిగా వర్గల్ అమ్మవారు

వర్గల్(గజ్వేల్): అమ్మ విజయదర్శనం..శ్రీరాజరాజేశ్వరిదేవిగా సాక్షాత్కారం..వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లిన దసరాశరన్నవరాత్రోత్సవాలు గురువారం విజయ దశమి వేడుకలతో ముగిశాయి. దసరా పర్వదిన వేళ జయములిచ్చే జగన్మాత శ్రీరాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారికి విశేషాభిషేకం జరిపారు. శమీపూజ అనంతరం ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు అమ్మవారి విజయదర్శనం లభించింది. శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీవెంకటేశ్వరునికి లక్ష తులసి దళార్చన నిర్వహించారు.



విజయదశమి రోజున శ్రీరాజరాజేశ్వరీదేవిగా వర్గల్ అమ్మవారు

దేశ ప్రగతికి పల్లెలే పట్టుగొమ్మలు

మంత్రి పొన్నం ప్రభాకర్



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పల్లెలు దేశ ప్రగతికి పట్టుగొమ్మలని గాంధీ అడుగు జాడల్లో మనమంతా నడవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో గురువారం గాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ....స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలని, రాజ్యాంగం పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, నాయకులు బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్ తదితరులు ఉన్నారు.

దసరా వేడుకల్లో పాల్గొన్న మంత్రి

గురువారం మున్సిపాలిటి ఆధ్వర్యంలో శివాలయం వద్ద నిర్వహించిన శమీ పూజలో మంత్రి పొన్నం పాల్గొన్నారు. అనంతరం ఎల్లమ్మ చెరువు వద్ద దసరా సందర్భంగా రామ్ లీలా కార్యక్రమంలో పాల్గొని మంత్రి రావణ దహనం చేశారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, మాజీ వైస్ చైర్ పర్సన్ అనిత తదితరులు ఉన్నారు.

సామాజిక సేవకు నిలయంగా సిద్దిపేట



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, తదితరులు

అమర్‌నాథ్ సేవా సమితి భవన భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటజోన్: సామాజిక, ధార్మిక, ఆధ్యాత్మిక సేవ, అన్నదానాలు, వివిధ సేవా కార్యక్రమాలకు నిలయంగా సిద్దిపేట నిలుస్తోందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం అమర్‌నాథ్ సేవా సమితి భవనం భూమి పూజ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిద్దిపేట నుంచి ప్రారంభమైన అన్నదానం అమర్‌నాథ్, అయోధ్య, కేదారినాథ్ వరకు సాగుతోందన్నారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలి

గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అహింసామార్గంలో శాంతియుతంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సింహ, సుడా మాజీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ. 7లక్షల ఆస్తి నష్టం


కూలిన ఇల్లు

సిద్దిపేటరూరల్: షాట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డం దినకర్‌రెడ్డి రోజులాగే ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లోని విద్యుత్ వైర్లు సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి నిప్పంటుకుంది. దీంతో రూ.లక్ష డబ్బులు, బియ్యం కాలి బూడిదయ్యాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక, పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. రూ.7లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ బాధితుడిని పరామర్శించారు. అధైర్యపడొద్దని.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఇంటికి దారి ఇవ్వడం లేదని..

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హవేళిఘణాపూర్(మెదక్): తన ఇంటికి వెళ్లేందుకు దారి మూసేశారని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుడుపల్లి సుభాష్ కొంత కాలంగా తనకు ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడంలో పాలివారు పలుమార్లు ఇబ్బందులు పెట్టారు. ఈ విషయంపై మెదక్ డీఎస్పీ, సీఐ, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని మనస్తాపంతో పురుగులు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని మెదక్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చేగుంట(తూప్రాన్): మండలంలోని పెద్దశివునూర్ ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. ఈ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి పూజ సామగ్రితో పాటు హుండీలోని నగదు, అమ్మవారి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయ తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా విచారణ చేపట్టినట్లు, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లిన మహిళ అదృశ్యం


సత్తమ్మ

చేగుంట(తూప్రాన్): మనమరాలిని చూసి వస్తానని హైదరాబాద్ వెళ్లిన మహిళ అదృశ్యమైంది. చేగుంటకు చెందిన కడమంచి గోపాల్ భార్య సత్తమ్మ హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో ఉన్న మనమరాలిని చూసేందుకు సెప్టెంబర్ 30న వెళ్లింది. అక్టోబర్ ఒకటిన ఆస్పత్రి నుంచి బయలుదేరిన సత్తమ్మ ఇంటికి చేరుకోలేదు. ఆమె జాడ కోసం బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకుండా పోయింది. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


ఈశ్వరీ

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ అనంతపురం జిల్లా కొత్తకోటకు చెందిన నాగార్జున, ఈశ్వరీ భార్యాభర్తలు. వీరు ఇబ్రహీంపూర్ పౌల్ట్రీలో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో పరిశ్రమ ఆవరణలో వారు ఉంటున్న గదిలో ఈశ్వరీ (33) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని పరిశ్రమ మేనేజర్ వీరేశ్ పోలీసులకు సమాచారం అందించారు. రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతురాలి మెడకు గాయాలు ఉండటంతో పోలీసులు మృతురాలి భర్త నాగార్జునను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: అరుణాచలం వెళ్తున్నానని భార్యకు ఫోన్ చేసిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన అనిల్ బాబు గత నెల 29వ తేదీన తన సోదరుడితో కలసి అరుణాచలం వెళ్తున్నానని భార్య అనురాధకు ఫోన్ చేసి తెలిపాడు. తిరిగి రాత్రి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో అనురాధ భర్త కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

పండగపూట విషాదం

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


చందర్

పాపన్నపేట(మెదక్): పండగ పూట విషాదం నెలకొంది. చేపల వేటకు వెళ్లిన గిరిజన యువకుడు నీట మునిగి చనిపోయాడు. ఈ ఘటన పాపన్నపేట మండలం అబ్లియా తండాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. తండాకు చెందిన లునావత్ చందర్(36) వ్యవసాయంతో పాటు, కూలీ పనులు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. చేపలు పట్టేందుకు గురువారం ఉదయం పాత లింగాయపల్లి శివారులోని పెద్ద చెరువుకు వెళ్లి వల వేసి వచ్చాడు. తిరిగి సాయంత్రం వెళ్లి వల తీసే యత్నంలో నీట మునిగి పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, రాత్రి వెతికినప్పటికీ ఆచూకి దొరక లేదు. శుక్రవారం ఉదయం చందర్ శవం లభించింది. భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లి కళ్లెదుటే మునిగిన కొడుకు


బాలేష్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పూజ సామగ్రి నిమజ్జనం చేసే క్రమంలో చెరువులో పడి తల్లి కళ్లెదుటే ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ నర్సింహులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి బాలేష్ (34) దేవీ నవరాత్రి ఉత్సవాలలో నిర్వహించిన పూజ సామగ్రిని గ్రామశివారులోని బొల్లెం కుంట చెరువులో నిమజ్జనం చేసేందుకు, తల్లి బాలమణితో కలిసి వెళ్లాడు. పూజ సామగ్రిని నిమజ్జనం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బాలేష్ చెరువులో పడిపోయాడు. ఈత రాని కొడుకు నీటిలో మునిగిపోవడం గమనించిన తల్లి బాలమణి వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో నుంచి బయటకు తీసుకొచ్చే సరికి, బాలేష్ అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య విమల ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

విషాదం నింపిన ఈత సరదా బావిలో మునిగి ఒకరు మృతి

అల్లాదుర్గం(మెదక్): దసరా పండగ పూట విషాదం చోటు చేసుకుంది. ఈతకు వెళ్లి బావిలో మునిగి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన అల్లాదుర్గం మండలం మాందాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం.. చిల్వర్ గ్రామానికి చెందిన మాడబోయిన యాదయ్య (41) జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. పండుగకు కుటుంబ సభ్యులతో ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం అన్నదమ్ముల పిల్లలతో కలిసి సరదాగా మాందాపూర్ గ్రామ శివారులోని చెన్న బోయిన కుంట బావిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ యాదయ్య నీట మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విందులో పాల్గొని వస్తుండగా..


అజయ్

హుస్నాబాద్‌రూరల్: స్నేహితుడు ఇచ్చిన విందులో పాల్గొని తిరిగి వస్తుండగా ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పూల్‌నాయక్ తండాకు చెందిన అజయ్ స్నేహితుడు శ్రీకాంత్‌కు గ్రూప్–1లో డీఎస్పీ ఉద్యోగం వచ్చింది. దీంతో శ్రీకాంత్ స్నేహితులందరికీ విందు ఏర్పాటు చేశాడు. పూల్‌నాయక్ తండాకు వెళ్లిన అజయ్ విందు అనంతరం రాత్రి పోతారం(ఎస్)కు తిరిగి వచ్చే క్రమంలో సబ్‌స్టేషన్ వద్ద బైక్ చెట్టుకు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై వెళ్లే వాహనదారులు రోడ్డు కింద బైక్ లైట్స్‌ను గమనించి.. అక్కడ ఒకరు పడిపోయి ఉండటంతో 108కు సమాచారం అందించారు. ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అప్పటికే అజయ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదంలో ఆపరేటర్ మృతి


అశోక్‌గౌడ్

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుత్ ప్రమాదంలో ఆపరేటర్ మృతి చెందాడు. ఈ సంఘటన తడ్కల్ గ్రామంలో విషాదం చోటుచేసుకొంది. నాలుగేళ్లుగా తడ్కల్ విద్యుత్ ఉప కేంద్రంలో ఆపరేటర్‌గా అశోక్‌గౌడ్ విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉప కేంద్రం పరిధిలోని ముర్కుంజాల్ శివారులో విద్యుత్ అంతరాయం సరిచేసేందుకు వెళ్లాడు. కాగా ఆ గ్రామ శివారులో జమ్గి ఫీడర్‌తో విద్యుత్ సరఫరా ఉండగా పొరపాటుగా తడ్కల్ ఫీడర్ ఆఫ్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా దురదృష్టవశాత్తు చేతికి విద్యుత్ షాక్ తగిలి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి


కొప్పుల రాజు

దుబ్బాక: దసరా పండుగ సంతోషంలో ఉన్న ఆ కుటుంబంలో విధి విషాదం నింపింది. తన మేకలు, గొర్రెలను మేతకు తీసుకెళ్లిన కాపరి పాముకాటుతో మరణించిన విషాదకర సంఘటన దుబ్బాక పట్టణంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన కొప్పుల రాజు(35) తన కులవృత్తి గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే మేకలు, గొర్రెలను మేత కోసం తీసుకెళ్లాడు. పట్టణంలోని గాంధీ విగ్రహం సమీపంలో కూలిన ఇంటి స్థలంలో జీవాలను మేపుతుండగా గడ్డిపొదల్లో ఉన్న నాగుపాము రాజును ఒక్కసారిగా కాటువేసింది. భయంతో రాజు పెద్దగా అరవడంతో చుట్టుపక్కల వారు గమనించి వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే రాజు మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ధైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

- డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం
- చిన్నారి మృతి..


రిశ్విత మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి వైష్ణవి, (ఇన్‌సెట్)లో రిశ్విత

గజ్వేల్‌రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని వస్తున్న ఓ కుటుంబంలో రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న ఆరేళ్ల చిన్నారి కళ్ల ముందే తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లికి చెందిన బాసాడి నరేష్‌రెడ్డి–వైష్ణవిలకు కూతురు రిశ్విత(6), కొడుకు ఎశ్విత్‌రెడ్డి సంతానం. నరేష్‌రెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఓ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. దసరా పర్వదినం కావడంతో నరేష్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంపై శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి చేగుంట మండలం కరణంపల్లిలోని ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లారు. దైవదర్శనం ముగించుకొని తిరిగి సంగుపల్లికి వస్తున్న క్రమంలో ధర్మారెడ్డిపల్లి శివారులోని రింగురోడ్డు దాటిన తర్వాత వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో రిశ్విత తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో నరేష్‌రెడ్డికి కాలు, వైష్ణవి చేతులకు తీవ్ర గాయాలవగా, ఎశ్విత్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. అప్పటి వరకు ఆనందంగా ఉండి దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో రిశ్విత మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. కళ్ల ముందే ఆరేళ్ల కన్నకూతురు రిశ్విత మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు..

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని రాజారాతండా చౌరస్తా వద్ద సుక్కల్‌తీర్థ్ గ్రామానికి చెందిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన సురేష్ (32) రోడ్డు పక్కన మృతి చెందాడు. దీంతో అతని సోదరి అంబవ్వ శవాన్ని పరిశీలించి తమ్ముడి మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ కేషయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిద్దిపేటరూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ తెలిపిన వివరాల మేరకు.. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన కురాకుల దేవయ్య(42) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం ఎప్పటి లాగే ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇలా ఉండగా సిద్దిపేటరూరల్ మండలం ఇర్కోడు శివారులోని దర్గా వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విచారణలో భాగంగా పోలీసులు మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కులం పేరుతో దాడి

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు


దాడి జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ నర్సింహులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని కులంపేరుతో దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏసీపీ నర్సింలు కేసుపై విచారణ చేపట్టారు. ఈ కేసు వివరాలను ఎస్ఐ వివరాలను వెల్లడించారు. మండలంలోని పీర్లపల్లికి చెందిన దేవి మహిపాల్, జగదేవ్‌పూర్‌కు చెందిన బి. ఎల్లయ్య, మహేష్, మల్లయ్య కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా భూ వివాదం కొనసాగుతుంది. కాగా గురువారం దేవి మహిపాల్ గొర్రెలను మేపుతుండగా.. ముగ్గురు కలిసి కర్రతో దాడి చేయగా మహిపాల్ తలకు గాయాలు కావడంతో పాటు ఓ గొర్రె మృతి చెందింది. వెంటనే బాధితుడు జగదేవ్‌పూర్‌లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై ఎస్సీ, ఎస్టీ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఏసీపీ నర్సింలు పీర్లపల్లిలో దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ చట్టం ప్రకారం నిందితులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కత్తులతో బెదిరించి.. డబ్బులు వసూలు

- దాడులకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోశ్



సంగారెడ్డి జోన్: జల్సాలకు అలవాటు పడి కత్తులతో బెదిరించి, దాడులు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్పీ పరితోశ్ పంకజ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన విజయ్ సింగ్, ఈశ్వర్ సింగ్‌తో పాటు మరో బాలుడు వెల్డింగ్ దుకాణంలో పనులు చేస్తున్నాడు. వీరంతా చెడు అలవాట్లకు బానిసయ్యారు. వచ్చిన సంపాదన సరిపోకపోవడంతో తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. పట్టణ శివారులోని హైవే రోడ్ల పక్కన నిర్మానుష్య ప్రదేశంలో ఏదైనా దోపిడీ, దొంగతనాలు చేసి డబ్బులు సంపాదించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. గత నెల 29న ముగ్గురు కలిసి నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి మీదుగా జహీరాబాద్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలనే టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడ్డారు. అర్ధరాత్రి 12:30 సమయంలో పటాన్ చెరు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై లారీ వద్దకు వెళ్లి డ్రైవర్, క్లీనర్లను కత్తితో బెదిరించి రూ.25 వేలు, ఒక సెల్ ఫోన్, అదే రోజు 01:40 సమయంలో కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తాలో డ్రైవర్‌ను డబ్బులు ఇవ్వమని బెదిరించారు. డబ్బులు ఇవ్వకపోవడంతో కత్తితో పొడిచి పారిపోయారు. అక్కడి నుంచి వెళ్లి 02:15 సమయంలో ప్యాలస్ హోటల్ సమీపంలో కత్తితో బెదిరించి రూ.5 వేలు, ఒక సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యారు. పటాన్ చెరు, కొండాపూర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఘటన జరిగిన 48 గంటల సమయంలోనే దాడులకు పాల్పడిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి దొంగిలించిన రూ.18,800, బైక్, కత్తి, సెల్‌ఫోన్ స్వాధీన పరుచుకున్నారు. వీరందరూ గతంలో మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. కాగా, ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని రిమాండ్‌కు తరలించగా.. మరో నిందితుడు బాలుడు కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు.

దారులన్నీ తుల్జాపూర్ వైపు..

భవానీ మాత దర్శనానికి కాలినడకన భక్తులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంత ప్రజలకు దసరా పెద్ద పండుగ. దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ భవానీ మాతకు పూజలు నిర్వహిస్తారు. శక్తి పీఠమైన తుల్జాపూర్ భవానీ మాతను తప్పకుండా దర్శించుకుంటారు. కాలినడక తుల్జాపూర్‌కు తరలి వెళుతుంటారు. దసరా పండుగ తర్వాత వేల సంఖ్యలో భక్తులు కాలినడకన వెళ్లి అమ్మను దర్శించుకుంటారు. ఈ మేరకు శుక్రవారం నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పాదయాత్రికులు తుల్జాపూర్‌కు బయలుదేరారు. పురుషులతో పాటు మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొన్నారు. ఇప్పుడు దారులన్నీ తుల్జాపూర్ వైపు అనట్లుగా గ్రామ గ్రామాల్లో భక్తులు హనుమాన్ మందిరాల నుంచి తెల్లవారుజామున పాదయాత్ర ప్రారంభించారు. కుల సంఘాలు, యువజన సంఘాల సభ్యులు పాదయాత్రికుల కోసం జాతీయ రహదారి పొడుగునా అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. కాలినడకన వెళ్లే భక్తుల విశ్రాంతి కోసం టెంట్‌లలో సౌకర్యాలు కల్పించారు. ఈ సంవత్సరం కూడా జహీరాబాద్ నుంచి కాకుండా సంగారెడ్డి, సదాశివపేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్ర ప్రారంభించారు. కాలినడకన వెళ్లిన భక్తులు పున్నమి రోజు వరకు తుల్జాపూర్‌కు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు.


హద్నూర్ నుంచి బయలుదేరిన పాదయాత్రికులు

దాడి కేసులో నలుగురిపై కేసు


పటాన్‌చెరు టౌన్: దాడికి పాల్పడిన పలువురిపై కేసు నమోదు చేసిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్ ఇంద్రమ్మ కాలనీకి చెందిన కిరణ్ అతడి స్నేహితుడు విష్ణు ఇరువురు కలిసి పాశమైలారంలో దసరా ఉత్సవాలు చూడటానికి వెళ్లారు. అయితే అక్కడ సాయిసాగర్ ఫుడ్ ఇండస్ట్రీస్ కంపెనీకి చెందిన నలుగురు వ్యక్తులు కలిసి గొడవ పడుతుండడంతో వారిని ఆపేందుకు విష్ణు అతడి స్నేహితుడు కిరణ్ లు వెళ్లగా వారిపై కట్టెలతో దాడి చేశారు. అదేవిధంగా బైక్‌ను ధ్వంసం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

భారీగా డ్రగ్స్ పట్టివేత


ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న డ్రగ్స్, అరెస్టు అయిన బస్సు డ్రైవర్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని రాష్ట్ర సరిహద్దులో చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి ఎక్సైజ్ శాఖ అధికారులు భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. వాహనాల తనిఖీలో భాగంగా గోవా నుంచి వస్తున్న ట్రావెల్ బస్సును తనిఖీ చేయగా 195 నైట్రోజెఫమ్ (డ్రగ్స్) టాబ్లెట్ల బాక్సులు దొరికాయి. సుమారు 46 కిలోలు ఉన్న డ్రగ్స్ విలువ రూ.73,12,500 ఉంటుంది. కర్నాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన ఓ వ్యక్తి బస్సు డ్రైవర్‌కు ఈ బాక్స్‌లను అప్పగించి హైదరాబాద్‌లో తీసుకొంటానని చెప్పాడు. డ్రగ్స్‌తో పాటు బస్సును సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేశామని, గుల్బర్గా వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రహదారిపై డ్రగ్స్ రవాణాను అరికట్టడానికి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

8న గిరిజనుల సమ్మేళనం


మాట్లాడుతున్న కిషన్ నాయక్

హుస్నాబాద్: లంబాడీల హక్కులను కాపాడు కోవడానికి భవిష్యత్ కార్యచరణలో భాగంగా 8న హుస్నాబాద్‌లో గిరిజనుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు బానోతు కిషన్‌నాయక్ చెప్పారు. శుక్రవారం నియోజకవర్గ లంబాడీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించడానికి కొంతమంది ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ కుట్రలను తిప్పి కొట్టడానికి పార్టీలకు అతీతంగా లంబాడీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భిక్షపతి, రవి, శంకర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, రాజు నాయక్, తిరుపతి నాయక్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో శశికళకు పీహెచ్‌డీ


శశికళ

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని చీమల పాటి వీఏ శశికళ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ‘ఎస్జీఎల్టీ– 2 నిరోధకం అయిన కెనాగ్లిఫ్లోజిన్, యాంటీ–ఆండ్రోజెన్ అయిన అబిరాటెరోన్ అసిటేట్, వాటి సంబంధిత పదార్థాల సమర్థవంతమైన సంశ్లేషణ’పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అన్నా ప్రగడ రత్నమాల శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శశికళ అధ్యయనంలో గ్లిఫ్లోజిన్ కెమిస్ట్రీ, అబిరాటెరోన్ అసిటేట్ ముఖ్యాంశాలుగా తెలియజేశారు. మొదటి పద్ధతిలో 17 గ్లిఫ్లోజిన్ ఉత్పన్నాల కోసం సింథటిక్ వ్యూహాల సమగ్ర సమీక్ష, ఇందులో కెనాగ్లిఫ్లోజిన్ సంశ్లేషణ కోసం ఒక వినూత్నమైన, సమర్థవంతమైన పద్ధతి అభివృద్ధి, ఔషధ ఆవిష్కరణలో ఆచరణాత్మక పద్ధతులను మెరుగు పరుస్తుందని వివరించారు. ఇక అబిరాటెరోన్ అసిటేట్ అధ్యయనంలో, అధునాతన 2డీ, 3డీ స్పెక్ట్రల్ పద్ధతులను ఉపయోగించి ఎనిమిది యూఎస్పీ జాబితాతో ఏపీఐ సంబంధిత మలినాలకు చెల్లు బాటయ్యే ఫ్రేమ్ వర్క్ తో పాటు, భారీ సంశ్లేషణకు పర్యావరణ అనుకూల, ఖర్చు–సమర్థవంతమైన, నాణ్యత ఆధారిత విధానం రూపొందించినట్టు తెలిపారు. ఈ పరిశోధనలు ఔషధ సంశ్లేషణలో స్థిరమైన, ఖచ్చితమైన, వినూత్న విధానాల యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు డాక్టర్ వీఏ శశికళను అభినందించారు.

సంగారెడ్డి రూరల్ ఎస్ఐపై వేటు


రూరల్ ఎస్సై రవీందర్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కేసు దర్యాప్తులో భాగంగా ఒక వ్యక్తి నుంచి డబ్బు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో జిల్లా ఎస్పీ ఈ నిర్ణయం తీసుకున్నారు. సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి లాడ్జి నిర్వాహకుడు జోగిపేట పట్టణం ఇందిరానగర్‌కు చెందిన అల్లే లోకేష్ (40)కు డబ్బులు అడగడటం.. పోలీసులు వేధింపులు ఎక్కువయ్యాయని మన:స్తాపానికి గురై నదిలోకి దూకి గల్లంతయ్యాడు. లోకేష్ భార్య ఎస్పీకి ఫిర్యాదు చేసింది. డీఎస్పీ ద్వారా ప్రాథమిక విచారణ జరిపించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. రూరల్ ఎస్ఐపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు. దీంతో మల్టీ జోన్‌ఐ ఐజీ ఆదేశాల మేరకు రవీందర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఏ స్థాయిలో ఉన్నా శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ పరితోష్ హెచ్చరించారు.

మహాత్మా మన్నించు..!

- జయంతి రోజునే గాంధీ విగ్రహం ధ్వంసం
- పోలీసుల అదుపులో 10 మంది నిందితులు!


యశ్వంతరావుపేటలో దుండగులు ధ్వంసం చేసిన గాంధీ విగ్రహం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని యశ్వంతరావుపేటలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ వైపు గురువారం జాతిపిత మహాత్ముడి జయంతి వేడుకలు నిర్వహిస్తుంటే.. గ్రామానికి చెందిన కొందరు యువకులు ఆయన విగ్రహాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. మహాత్ముడి జయంతి రోజున విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. గ్రామంలో అల్లర్లు చెలరేగకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు యువకుల ప్రమేయం ఉందని గుర్తించి వారిని పోలీస్‌స్టేషన్ తరలించి విచారించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నూతన గాంధీ విగ్రహాన్ని తెప్పించి ధ్వంసం చేసిన చోటే ప్రతిష్ఠించి జయంతి వేడుకలను నిర్వహించారు. కాగా, ఈ ఘటనలో పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

విగ్రహ ధ్వంసంలో జాతీయ పార్టీ నాయకుల ప్రమేయం

యశ్వంతరావుపేటలో మహాత్ముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో గ్రామానికి చెందిన పలువురు యువకులు ఓ జాతీయ పార్టీకి చెందినవారు అని తెలిసింది. గురువారం తెల్లవారుజామున వారంతా కలసికట్టుగా విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉండటం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. ఏదేమైనా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా కప్పాటి


పాండురంగారెడ్డి

కందుకూరు: తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు అధ్యక్షురాలు కవిత శుక్రవారం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. ఆత్మగౌరవంతో కూడిన తెలంగాణ కోసం పేదల పక్షాన నిలబడి పోరాటం చేస్తానని అన్నారు. తనను ఎన్నుకున్నందుకు కవితకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ సదస్సుకు షాద్‌నగర్ వాసికి ఆహ్వానం


డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ స్పాన్సర్‌షిప్‌తో ఈ నెల 9,10 తేదీల్లో జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు షాద్‌నగర్ పట్టణానికి చెందిన అర్థశాస్త్ర అధ్యాపకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డిని ఆహ్వానించారు. 'క్లైమేట్ చేంజ్ అండ్ ఎనర్జీ ఫర్ వికసిత్ భారత్ 2047' అంశంపై ప్రొఫెసర్లతో నిర్వహించే సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్లు హాజరు కానున్నారు. వాతావరణంలో మార్పులతో దేశంలో ఆర్థిక వ్యవస్థ ఏవిధంగా ప్రభావితం అవుతుందనే అంశంపై ప్రసంగించనున్నట్లు డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తెలిపారు.

గాంధీజీకి ఘన నివాళి


గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: అహింసా, సత్యాగ్రహం ద్వారా బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మాగాంధీ కీలకపాత్ర పోషించారని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. జిల్లెలగూడ చందన చెరువు కట్టపై గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, వెంకటేశ్‌గౌడ్, గజ్జెల రాంచందర్, ఓంప్రకాశ్, విజయవర్ధన్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, పరశురాం పాల్గొన్నారు.

ఆలయం ప్రధాన ద్వారం ప్రతిష్ఠలో పీసీసీ చీఫ్


పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర అభిషేక ఆనంద ఆలయం గర్భాలయం ప్రధాన ద్వారం ప్రతిష్ఠ కార్యక్రమానికి శుక్రవారం పీసీసీ చీఫ్ మహేశ్ మార్ గౌడ్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన ద్వారం గడప పూజ, కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతిని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉదావత్ లచ్చిరాంకు గ్లోబల్ పీస్ అవార్డు


ఉదావత్ లచ్చిరాం

తుర్కయంజాల్: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పురపాలక సంఘం పరిధి మునగనూర్‌కు చెందిన డా.ఉదావత్ లచ్చిరాంకు భారత్ బ్రాండ్ బుక్ ఆఫ్ రికార్డ్ న్యూఢిల్లీ సీఈఓ డి.కె.రాజ్ శుక్రవారం ఆన్‌లైన్‌లో గ్లోబల్ పీస్ అవార్డ్–2025 అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర ఉద్యమం నాటి సంఘటనలు వివరించడం, కేంద్రం నిర్వహిస్తున్న క్విజ్ పోటీల్లో పాల్గొనేలా చేయడం, అహింసా మార్గాన్ని బోధించడంలో కృషి చేసినందుకు ఈ అవార్డు వరించిందని తెలిపారు.

మైక్‌సెట్ అందజేత

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన యువకుడు కుంభాల చంద్రశేఖర్ శుక్రవారం గ్రామంలోని మహిళలకు ఆంప్లిఫైర్, మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు బతుకమ్మ ఆటలకు, దుర్గామాత వద్ద పూజలకు వినియోగించేందుకు మైక్ సెట్ అందజేశామన్నారు. గ్రామానికి సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని చెప్పారు.


ఆమనగల్లు: కాలేజీగ్రౌండ్స్‌లో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న ప్రజలు

ఊరూరా.. దసరా

దసరా వేడుకలను గురువారం జిల్లావాసులు ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శమీ వృక్షాలకు పూజలు చేసి ఆకును ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని అలయ్‌బలయ్‌తో శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా పలుచోట్ల రావణదహనం చేపట్టారు. ఎక్కడెక్కడో ఉన్నవారంతా పండుగకు రావడంతో పల్లెల్లో సందడి వాతావరణం కనిపించింది.


చేవెళ్ల: శంకర్‌పల్లిలోని మార్కెట్ యార్డులో రావణ దహనం

పత్తి సేకరణకు సన్నద్ధం

నవంబరు మొదటి వారంలో ప్రారంభించే అవకాశం

- జిల్లాలో పత్తి రైతులు 1,25,000 మంది
- సాగు చేసింది 2,46,725 ఎకరాల్లో..
- ఉత్పత్తి అంచనా 2,68,282 మెట్రిక్ టన్నులు
- 14 కేంద్రాలు ఏర్పాటు


పత్తి కొనుగోలు కేంద్రం

వికారాబాద్: జిల్లాలో పత్తి కొనుగోలుకు సీసీఐ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో ప్రక్రియ చేపట్టనుండగా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పర్యవేక్షిస్తారు. వానలు తగ్గుముఖం పట్టి ఎండలు ప్రారంభమైతే మరో నెల రోజుల్లో పత్తి తీసే పనులు ప్రారంభిస్తారు. ఎంత మేర దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 5లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగువుతుండగా ఎక్కువ భాగం పత్తి వేశారు. 1,25,000 మంది రైతులు 2,46,725 ఎకరాల్లో పంట వేశారు. ఈ లెక్కన ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల చొప్పున దాదాపు 2,68,282 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మొత్తాన్ని సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ కోసం స్థలం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. కాటన్ మిల్లుల వద్ద ఏర్పాటు చేసే వేయింగ్ మిషన్లు తూనికల కొలతల శాఖ అధికారులు పరిశీలించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు.

ఈ సారైనా ఇబ్బందులు తప్పేనా?

ఐదారు సంవత్సరాలుగా పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఈ సారైనా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని పత్తి రైతులు కోరుతున్నారు. ఏటా వికారాబాద్, పరిగి వ్యవసాయ డివిజన్లలో పత్తి అత్యధికంగా సాగు చేస్తున్నా అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. తక్కువ సాగయ్యే తాండూరు ప్రాంతంలో మాత్రం ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పరిగి, పూడూరు మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు కొనుగోలు కేంద్రాల్లోనే పరిగి, వికారాబాద్ వ్యవసాయ డివిజన్లకు చెందిన రైతులు పత్తి విక్రయిస్తుండటంతో రద్దీ విపరీతంగా పెరుగుతోంది. దీంతో రైతులు వారాల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ బాధలు భరించలేక పలువురు దళారులను ఆశ్రయిస్తున్నారు.

అంచనాలు తలకిందులయ్యే అవకాశం

మరో నెల రోజుల్లో పత్తి దిగుబడి మార్కెట్‌లోకి రానుంది. గత రెండు సీజన్లలో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు ఉండటంతో కొనుగోలు కేంద్రాలకు పత్తి అంతంత మాత్రంగానే వచ్చింది. ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఓపెన్ మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో కొనుగోలు కేంద్రాలకు భారీగా వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ పత్తికి రూ.8,110, సాధారణ రకానికి రూ.7,710 మద్దతు ధర నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు రూ.7వేల నుంచ రూ.7,500 వరకు ధర పలుకుతోంది. సీజన్ ప్రారంభమయ్యేనాటికి ఈ ధరలు మరిం పడిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు అవకాశం ఉంది. అధికారుల అంచనాలు కూడా తారుమారు కావచ్చు. అధిక వర్షాల కారణంగా ఈ సారి దిగుబడి తగ్గేలా ఉందని రైతులు అంటున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలో పత్తి సేకరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సదుపాయాలు కల్పించాలని ఆదేశించాం. 14 కేంద్రాలను ఏర్పాటు చేశాం. తూకాల్లో మోసాలకు అవకాశం లేకుండా చూస్తాం. రైతులు కూడా కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలి.

– లింగ్యానాయక్, అదనపు కలెక్టర్


కలెక్టరేట్‌లో గాంధీ జయంతి వేడుకల్లో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి తదితరులు

ఘనంగా గాంధీ జయంతి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ గాంధీ చూపిన అహింస,శాంతి, సత్యం, ప్రేమ మార్గంలో నడవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

– అనంతగిరి


నివాళులర్పిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి


అనంతగిరి: అశ్వవాహన సేవలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు


కొడంగల్: అశ్వ వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

అశ్వ వాహనంపై అనంతుడు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారు అశ్వ వాహనంపై విహరించారు.

అంతకుముందు స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు. జమ్మి చెట్టుకు పూజలు చేసి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

కొడంగల్: పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దసరా పండుగ సందర్భంగా గురువారం సాయంత్రం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కలియుగాంతంలో శ్రీనివాసుడు అశ్వవాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడని చాటి చెప్పడమే ఈ వాహనం పరమార్థమని అర్చకులు తెలిపారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దేవేరుల సమేత మలయప్పస్వామి అశ్వవాహనంపై పారువేటకు బయలుదేరి బస్టాండ్ సమీపంలోని శాంతినగర్ కాలనీలో పూజలు అందుకున్నారు. మండపం సమీపంలో ఏర్పాటు చేసిన జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాళికామాత పల్లకీ సేవను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆలయం నుంచి అమ్మవారి పల్లకీసేవ బయలుదేరి పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కాలనీల్లో భక్తులు పూజలు చేశారు.

సబితారెడ్డిని కలిసిన ఆనంద్

అనంతగిరి: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మె ల్యే సబితారెడ్డిని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. మాల్ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల తరఫున నిత్యం పోరాటాలు చేసే సీపీఎం అభ్యర్థులను గెలిపిస్తే మేలు జరుగుతుందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.

పూటకో మాట.. రోజుకో తీరు

'తెలంగాణ తల్లి' బోర్డు తెర తీశారు


తెర తొలగించాక అక్షరాలు, సూచికలు కనిపిస్తున్న బోర్డు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్ బోర్డుకు సంబంధించి జీహెచ్‌ఎంసీ తీరు ప్రజలకు అంతుచిక్కడం లేదు. ఫ్లై ఓవర్ ఒకవైపు (పాత సచివాలయం వైపు) ప్రవేశ మార్గంలో గత మంగళవారం ప్రజలకు దర్శనమిచ్చిన బోర్డును సాయంత్రానికి అక్షరాలు కనిపించకుండా తెర వేశారు. తెలుగుతల్లిగా ఉన్న పేరును తెలంగాణ తల్లిగా మార్చడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో జీహెచ్‌ఎంసీ చేసిన ఆ పనితో పలు సంశయాలు వెల్లువెత్తాయి. సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో ఫ్లై ఓవర్ రెండో వైపు (లోయర్ ట్యాంక్‌బండ్) ప్రవేశమార్గంలో కూడా బోర్డు ఏర్పాటు చేశాక రెండింటినీ కలిపి ఒకేసారి ప్రారంభిస్తామని జీహెచ్‌ఎంసీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు రోజుల్లో రెండింటినీ కలిపి ఒకేసారి ప్రారంభిస్తామని పేర్కొంది. కానీ.. రెండో వైపు బోర్డు ఏర్పాటు కాకుండానే సచివాలయం వైపు బోర్డుకు వేసిన తెరను తొలగించి, తిరిగి అక్షరాలు కనిపించేలా చేసింది. ఇంతమాత్రానికి ఈ తతంగమంతా ఎందుకు? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత ఒకవైపు మాత్రమే ఏర్పాటు చేస్తే ఎవరైనా కాదన్నారా? ఎందుకు మూసేశారు? రెండోవైపు ఏర్పాటు కాకున్నా మళ్లీ ఎందుకు తెర తీశారు? రెండూ ఒకేసారి ప్రారంభిస్తామని ఎందుకు ప్రకటించారు? అంటూ పలువురు జీహెచ్‌ఎంసీ చర్యల్ని తప్పుపడుతున్నారు.

మ్యాన్‌హోల్‌లో పడి వ్యక్తి మృతి


మ్యాన్ హోల్‌లో మాసయ్య మృతదేహం

తాండూరు: తాగిన మైకంలో తాగునీటి మ్యాన్‌హోల్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూరు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత తాండూరు అంబేడ్కర్ పార్కులో తాగునీటి మ్యాన్ హోల్ ఉంది. ఇదే కాలనీకి చెందిన మాసయ్య(50) తాగిన మైకంలో అందులో పడి మృతి చెందాడు. పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారులు మ్యాన్‌హోల్‌లో మనిషి ఉన్నట్లు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. స్థానికులు మాసయ్య మృతదేహాన్ని బయటికి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- నరదాగా చెరువు చూసేందుకు వెళ్లిన 20 మంది బాలికలు
- ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరి దుర్మరణం
- దుద్యాల్ మండలం అల్లిఖాన్‌పల్లిలో ఘటన


ప్రణతి (ఫైల్)


వృక్షిత (ఫైల్)


వృక్షిత మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దుద్యాల్: చెరువు అలుగు పారుతుండటంతో తోటి స్నేహితులతో కలిసి చూడటానికి వెళ్లిన ఇద్దరు బాలికలు ప్రమాదవశాత్తు నీట మునిగి దుర్మరణం చెందారు. ఈ ఘటన దుద్యాల్ మండలం, అల్లిఖాన్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామ సమీపంలోని చింతల్ చెరువు అలుగు పారుతోంది. దసరా సెలవులు శుక్రవారంతో ముగియనుండటంతో గ్రామానికి చెందిన 20 మంది స్నేహితులు(బాలికలు) ఉదయం సైకిళ్లపై చెరువు చూడటానికి వెళ్లారు. కొద్దిసేపు నీటిలో సరదాగా గడిపారు. గ్రామానికి చెందిన ఊదరి రాములు, లక్ష్మి దంపతుల కూతురు ప్రణతి(13), కొత్తపల్లి పాండు, అరుణ దంపతుల కూతురు వృక్షిత(12) అలుగు దాటి నీటిలో కొంత దూరం వెళ్లారు. అక్కడి గుంతలో పడి మునిగిపోయారు. అక్కడే ఉన్న ప్రణతి అక్క నందిని తోటి స్నేహితులు గట్టిగా కేకలు వేస్తూ ఏడవడం మొదలు పెట్టారు. కొద్ది దూరంలో బట్టలు ఉతుకుతున్న మహిళలు చెరువు వద్దకు వచ్చారు. వారికి కూడా ఏం చేయాలో తెలియక అలాగే ఉండిపోయారు. చెల్లెలు ప్రణతి, మరో బాలిక వృక్షితను కాపాడుకోవాలనే తపనతో నందిని అల్లిఖాన్‌పల్లి రోడ్డు వద్దకు పరుగులు పెట్టింది. అటుగా వెళ్తున్న యువకులకు విషయం చెప్పింది. వారు చెరువు వద్దకు చేరుకొని నీట మునిగిన ప్రణతి, వృక్షితను బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. దీంతో స్నేహితులు బోరున విలపించారు. విషయం బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు తెలియడంతో పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రణతి 9వ తరగతి, వృక్షిత 8వ తరగతి చదువుతున్నారు.

నిత్యం కలిసి పాఠశాలకు..

ప్రణతి, వృక్షిత నిత్యం కలిసి పాఠశాలకు వెళ్లేవారు. కలిసే భోజనం చేసేవారు. వీరిద్దరూ మంచి స్నేహితులని తోటి విద్యార్థులు తెలిపారు. తరగతులు వేరైనా ఎంతో ఆప్యాయంగా ఉండేవారని, వారు చనిపోవడం చాలా బాధేస్తోందని కన్నీరు పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ విజయరామారావు, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంఈఓ తన వంతుకు రెండు కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.